క్లుప్తంగా

డ్రైవర్లకు అభినందన



డ్రైవర్లను అభినందిస్తున్న డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చే డ్రైవర్లు అభినందనీయులని ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక కొనియాడారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, ఇతర ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు గులాబీలు, చాక్లెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డ్రైవర్లందరినీ అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్నం తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు రహదారి భద్రతపై జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో లైసెన్సులకు వచ్చిన వారికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.సబితా, జి.రాధికాదేవి, పీవీవీడీ సాయికుమార్, కార్యాలయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసాచార్యులు, ఎల్.పెన్సిన్ బాబు, మెడికల్ ఆఫీసర్ పి.మాధురిదేవి, ఏఎస్సై రాంబాబు పాల్గొన్నారు.

రాయితీ సిలిండర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రాయితీ గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు: స్థానిక హోటళ్లపై రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహావసరాలకు ఉపయోగించే ఐదు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. తిలక్ రోడ్డులోని వనిత కర్రీ పాయింట్, కేటరింగ్‌లో రాయితీ సిలిండర్లు ఉపయోగిస్తున్నారని అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు తనిఖీలు చేసి ఐదు సిలిండర్లు గుర్తించారు. ఆ యజమాని పిల్లి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. గృహ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు హెచ్చరించారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు లోవకుమార్, వీరబాబు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

సీఐ వినయ్‌మోహన్‌కు అభినందన



సీఐ వినయ్‌మోహన్‌కు మొక్కను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ధవళేశ్వరం: స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జీవీ వినయ్‌మోహన్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు కలసి అభినందించారు. నాయకులు గోలి దేవకుమార్, శ్రీరంగం బాలరాజు, గునిపే అశోక్, గూటం రాజు, ముత్యాల జాన్, సురేష్ తదితరులు సీఐను కలసి మొక్కను అందజేశారు.

విచారణ చేయాలని వినతి

కడియం: కడియపులంక పంచాయతీలో రికార్డులు మాయమయ్యాయని, గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఖర్చుల వివరాలు అడిగితే ఇవ్వడం లేదని వార్డు సభ్యుడు బోడపాటి మూర్తి, పలువురు గ్రామస్తులతో కలసి జేసీ తేజ్‌భరత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక విలేకరులకు వివరాలు తెలిపారు. నిధుల దుర్వినియోగం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పెత్తనం, నిధుల పక్కదారి, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లించకుండా వేధించడం తదితర 15 అంశాలతో ఫిర్యాదు చేశామన్నారు. అలాగే తన అవినీతి అక్రమాలను ఎవరూ ప్రశ్నించకుండా కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ ప్రజలపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని, పంచాయతీ పాలనపై సమగ్ర విచారణ జరిపించాలని బుర్రిలంకకు చెందిన ఈలి శ్రీనివాసరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం: రాజానగరం, దివాన్‌చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదు. బుధవారం ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల దివాన్‌చెరువు, పాలచర్ల, శ్రీరామపురం, రాజానగరం, తూర్పు గానుగూడెం, పల్లకడియం, రామస్వామిపేట, జ్ఞానజగతి, రంగంపేట మండలం ఎస్టీరాజాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రతిభకు వేదిక 'ఆడుదాం ఆంధ్రా'



హుకుంపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



బొమ్మూరులో కబడ్డీ క్రీడాకారులతో బీచ్ వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారిణి లలితాదేవి

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ప్రతిభను చాటే వేదికగా నిలుస్తుందని బీసీ సంక్షేమ రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి, రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం హుకుంపేటలోని డీమార్ట్ పక్కన ఉన్న గ్రౌండ్‌లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రికెట్ ఆడి మంత్రి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఏర్పాటైన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ యువతలో క్రీడా ఆసక్తి కలిగించేలా రూ.120 కోట్లతో 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. బుధవారం నుంచి నియోజకవర్గ స్థాయిలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ క్రీడల్లో పాల్గొనేందుకు ఇది ఒక చక్కని వేదికగా నిలుస్తుందన్నారు. అమ్మ ఒడి పథకంతో పేద పిల్లలంతా చదువుల బాట పట్టారని మంత్రి అన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే పథకాలు అందుతున్నాయని వివరించారు. ఆడుదాం- ఆంధ్రా అంబాసిడర్లు బీచ్ వాలీబాల్ జాతీయ క్రీడాకారిణి యార్లగడ్డ లలితాదేవి, బాక్సింగ్ క్రీడాకారిణి ఎన్.ప్రజ్ఞలను ఘనంగా సత్కరించారు. అనంతరం బొమ్మూరులోని జీపీఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను లలితాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్రా పోటీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ, నియోజకవర్గ ఆడుదాం- ఆంధ్రా నోడల్ అధికారి, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.స్వామినాయుడు, మండల ప్రత్యేకాధికారి, ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి కేవీఎస్ జ్యోతి, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, వైఎస్సార్ సీపీ నేతలు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రగతి పథం.. నగరం సొంతం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ము పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజమహేంద్రవరం నగరాన్ని ప్రగతి పథంలోకి తీసుకు వచ్చామని, అది ప్రతిపక్షాలకు కనబడటం లేదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగర అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. బుధవారం ఇక్కడి 35, 36, 39వ డివిజన్‌లకు సంబంధించి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులను స్థానిక తుమ్మలావ, 45, 46, 47 డివిజన్‌లకు చెందిన లబ్ధిదారులకు క్వారీ సెంటర్ శివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నమూనా చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ పదిహేను ఏళ్లపాటు టీడీపీ వారే మేయర్లుగా, ఎమ్మెల్యేలుగా ఉన్నారని, ఈ నాలుగున్నరేళ్లలో తాను చేసినంత అభివృద్ధి ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. టీడీపీ నేతలు వచ్చిన నిధులను మాత్రం వాటాలేసుకుని అడ్డంగా దోచుకుతిన్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం కేవలం రూ.400 కోట్లతో అభివృద్ధి చేసి నగర రూపురేఖలు మార్చానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత ప్రగతి పథాన తీసుకెళ్తానని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని, ఆయన ప్రోత్సాహంతోనే నగరాన్ని అభివృద్ధి చేశానన్నారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి నిండా ముంచేశాడన్నారు. కార్యక్రమంలో నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పోలు విజయలక్ష్మి, నాయకులు ప్రసాదుల హరినాథ్, నందం స్వామి, లంక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా

నగరంలో అన్ని డివిజన్లలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత నగర పాలక సంస్థ అధికారులదేనని ఎంపీ భరత్‌రామ్ స్పష్టం చేశారు. స్థానిక శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నగరంలోని 42 డివిజన్‌లకు చెందిన వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జులు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ఎంపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అన్ని డివిజన్లలో ప్రాధాన్య క్రమంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకూ ఆయా డివిజన్లలో ఏ ఏ పనులు చేశారు, ఇంకా మిగిలిన వాటిని ఎప్పటిలోగా చేస్తారనే విషయాలను ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావును అడిగి తెలుసుకున్నారు. డివిజన్లలో పార్టీ నాయకులు, ఇన్‌చార్జులు ఆర్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సహకరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. దగ్గరుండి పనుల్లో నాణ్యత చూడాలన్నారు. వార్డుల్లో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి, ఆర్ఎంసీ అధికారులకు తెలపాలని ఎంపీ సూచించారు.



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీఎస్పీ విజయ్‌పాల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయ్‌పాల్ అన్నారు. స్థానిక ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కప్పల రజనీదేవి, ఒరిగేటి ధనరాజు మోరంపూడి వెళ్తుండగా మార్గాని ఎస్టేట్ సమీపంలో వెంకన్న అనే వ్యక్తి రోడ్డు మధ్యలో చెత్తను పోస్తున్నాడన్నారు. దీనిని చూసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అది తప్పని చెప్పి ఫోటో తీస్తుండగా, వెంకన్న గమేళాతో తలపై కొట్టాడన్నారు. దీనిపై సమాచారం అందుకున్న ప్రకాశ్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను విడదీసి ఆధారాలు సేకరించారన్నారు. ఈ మేరకు వెంటనే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. అయితే ఈ కేసులో పోలీసులు స్పందించడం లేదంటూ వచ్చిన వార్తలు నిజం కాదన్నారు. సమావేశంలో ఎస్సై ప్రేమ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి



ధవళేశ్వరంలో స్వచ్ఛత.. మన బాధ్యత ర్యాలీలో మంత్రి వేణుగోపాలకృష్ణ



ఐటీసీఎల్ కాలనీలో డ్రైనేజీ సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- శంభూనగర్‌లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆరోగ్యవంతమైన సమాజానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని మంత్రి, రూరల్ నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధి 17వ డివిజన్ శంభూనగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ శిబిరానికి వస్తున్న రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ వైద్య ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ 55 వేల మంది వైద్య సిబ్బందిని నియమించారన్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.25 లక్షల ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. అనంతరం వైద్యాధికారి ఎం.మనాంద్ చంద్ నుంచి ఆరోగ్య సురక్ష ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. స్వచ్ఛత మన బాధ్యత.. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఆయన 17వ డివిజన్‌లోని ఐటీసీఎల్, శంభూనగర్, బొగ్గులదిబ్బ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి వార్డులో మురుగునీటి పారుదల, మెరుగైన పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రూరల్ ప్రాంతాల్లోని ప్రతి వార్డును పరిశీలించి స్వచ్ఛత నెలకొల్పడమే గుడ్ మార్నింగ్ కార్యక్రమం ఉద్దేశమని మంత్రి అన్నారు. ఐటీసీఎల్ కాలనీలోని మహిళలు పలు సమస్యలు వివరించగా, వాటిని వెంటనే పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావును ఆదేశించారు. అలాగే ఐటీసీఎల్ కాలనీ, శంభూనగర్లో రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగే విధంగా చూడాలని మంత్రి అన్నారు. స్థానికంగా గున్నం వరలక్ష్మి హోటల్ వద్ద మంత్రి స్వయంగా పెసరట్లు వేశారు. శంభూనగర్ రైతుబజార్‌ను పరిశీలించి కొనుగోలుదారులు, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్ నేత చీకురుమిల్లి చిన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రొంపిచర్ల రమేష్, దోనపాటి రాజేష్, నాగిరెడ్డి (జెట్టీ), గుడివాడ ప్రేమ్‌కుమార్, చిన్నపండు, రూరల్ డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి మింది నాగేంద్ర, జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు (రాజమౌళి), చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ సిద్ధాగిరి పాల్గొన్నారు.

సమష్టి కృషితో మెరుగైన పారిశుధ్యం

ధవళేశ్వరం: సమష్టి కృషితో మెరుగైన పారిశుధ్యాన్ని సాధించవచ్చని మంత్రి శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరంలో పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛత- మన బాధ్యత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత ప్రధాన రహదారి నుంచి మంత్రి అధికారులు, నాయకులతో కలసి పాదయాత్ర చేశారు. అగ్రహారం, క్వారీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ప్రత్యేక బృందాలతో పారిశుధ్య పనులు మరింత సమర్థంగా చేయించాలని పంచాయతీ అధికారులకు తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), తలారి వరప్రసాద్, పుట్టా పరేష్‌నాథ్, షట్టర్ బాషా, బోడపాటి కుమార్, దేవులపల్లి సరితారాణి, గునిపే అశోక్, పెన్నాడ జయప్రసాద్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుమారి మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 నిబంధనలపై అవగాహన కల్పించారు. స్కానింగ్ పరీక్షలు నిర్వహించే ప్రతి కేంద్రానికి రిజిస్ట్రేషన్ ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా పరీక్షలు చేస్తే చర్యలు తప్పవన్నారు. మహిళ గర్భంలోని శిశువు ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొనేందుకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణకు సంబంధించిన ప్రకటనలు చేస్తే మూడేళ్ల జైలు, రూ.పది వేల జరిమానా పడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రత్యేక చొరవ తీసుకుని సామాన్యులకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. న్యాయ సందేహాలు, సమస్యలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి మాట్లాడుతూ లింగ నిర్ధారణతో జనాభాలో సమతుల్యత లోపిస్తుందని, అది సమాజానికి ప్రమాదకరమన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం, సరైన ఆరోగ్య నియమాలను పాటించడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మిస్తారన్నారు. సదస్సులో డీఐఓ డాక్టర్ ఎన్.రాజకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



సదస్సులో ప్రసంగిస్తున్న సంఘ నాయకులు

ధవళేశ్వరం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, గిరిజన సంఘ గౌరవ అధ్యక్షుడు ఎల్లా రామిరెడ్డి కోరారు. బుధవారం ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం కమ్యూనిటీ హాల్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘీబావ సదస్సును రైతు కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ఆదివాసుల డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పంపిన సందేశాన్ని సదస్సులో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎమ్ఎస్ నాగరాజు చదివి వినిపించారు. ఆదివాసీ లీగల్ సెల్ కన్వీనర్ పల్లా త్రినాథ్‌రావు మాట్లాడుతూ గిరిజనులకు భూమికి భూమి మెరుగైన పునరావాసం కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పరాభవమే..

- విలేకరుల సమావేశంలో ముస్లిం నేతలు
- నగరంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్, హబీబుల్లాఖాన్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తీవ్ర పరాభవం తప్పదని వైఎస్సార్ సీపీ నేతలు, నగర అధికార ప్రతినిధి ఎండీ హబీబుల్లా ఖాన్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్, నగర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆరిఫుల్లా ఖాన్, మైనారిటీ రాష్ట్ర నాయకుడు షేక్ నిజాం తదితరులు అన్నారు. బుధవారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాజమహేంద్రవరం అజాద్ చౌక్ వద్ద టీడీపీ నిర్వహించిన సమావేశంలో ఆదిరెడ్డి వాసు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేశారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గత టీడీపీ పాలనలో ముస్లింలకు చేసిందేమీ లేదన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ మేయర్ వీర రాఘవమ్మ, ఎమ్మెల్యే భవాని రాజమహేంద్రవరం నగరానికి గాని, ముస్లిం మైనారిటీలకు గాని ఏ విధమైన మేలు చేయలేదని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే తమకు మేలు జరిగిందని వివరించారు. గత ప్రభుత్వంలో టీడీపీకి భజనలు చేసే వారికే పథకాలు అందాయని అన్నారు. రాజమహేంద్రవరం ఎంపీగా మార్గాని భరత్‌రామ్ ఐదేళ్లలో నగరాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారని, దీనిని చూస్తున్న జనం ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వాసుకు టీడీపీ టికెట్ రాదని, వచ్చినా గెలవడని అన్నారు. అధికారం కోసం జనసేన బీజేపీతో, టీడీపీ జనసేనతో, అదే టీడీపీ కాంగ్రెస్‌తో, కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు పెట్టుకొంటున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా ఒంటరిగా ఎన్నికల బరిలో నిలబడుతుందని అన్నారు. ప్రజల మద్దతే తమ పార్టీకి బలం అని అన్నారు. ఎమ్మెల్సీ పదవి తీసుకుని వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచింది ఆదిరెడ్డి అప్పారావు అని ఎద్దేవా చేశారు. ఎవరు ఎంత రెచ్చగొడదామని చూసినా తమ నినాదం ఒక్కటే 'జై జగన్, జై భరత్' అన్నారు. అఖండ మెజారిటీతో నగర ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపించి తీరతామని ప్రకటించారు. సమావేశంలో గొలుసుల పంజా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అక్రం, మైనారిటీ సెల్ సిటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అల్తాఫ్, పార్టీ నాయకుడు గుంటూరు జిల్లా మటన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, మటన్ మర్చంట్స్ కమిటీ సభ్యులు సిద్దిక్ ఉమేర్ మౌలు, సుభాని, ఉమర్, దోహెబ్ తదితరులు పాల్గొన్నారు.